మంచిపిల్ల సంపంగి

(క థా ని క)

"ఇంకేం కావాలి?" అడిగాడు కూరల వర్తకుడు.

"వీశె బంగాళీ దుంపలు వెయ్యి" అన్నాడు రామదాసు.

"రామదాసూ! ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావురా, తమ్ముడూ! ముప్పై దాటిపోతూంది. నలభయ్యోపడిలో నడ్డివంగిపోయి నడవలేక పోతున్నప్పుడు చేసుకుంటావా? ఖర్మ కాలి, అప్పుడు చేసుకున్నా ఏం అనుభవించగలవు? ఎవరికో ఒకరికి ధారాదత్తం చెయ్యవలసిందే—కన్యని!" అన్నాడు వీశె దుంపలూ, రామదాసు సంచిలో పోస్తూ వర్తకుడు.

రామదాసు సిగ్గునభినయం చేశాడు.

"ఇంకేం కావాలి?" అడిగాడు మళ్ళీ వర్తకుడు.

"పావువీశె నక్కదోసకాయలు పడేయ్. అయ్యగారికి అవి చాలా యిష్టం" అన్నాడు రామదాసు. "అయ్యగారికవంటే మహా ప్రేమ."

"అయ్యగారి ప్రేమ నక్కదోసకాయల మీద. మరి నీ ప్రేమ ఎవరిమీద రామదాసూ! ఎవరినైనా ప్రేమించావా లేదా? ఇంత నీ దీర్ఘజీవితంలో ఒక్కగానొకతెని ఎవర్తెనో ప్రేమించలేకపోయావూ? ప్రేమ పుట్టలేదా ఏమిటి? లేక ఈవూళ్ళో నీకు నచ్చిన అమ్మాయి ఎవర్తీ దొరకలేదా? లక్షలున్నారు. ఒక్కసారి కన్నుగీటితే, ఎవర్తో ఒక అనాధురాలు నిన్ను వివాహం చేసుకోడానికి అంగీకరించి వుండదా? అసలు నువ్వు మొద్దువి, సిసలైన పాషాణానివి, నీకు ప్రేమేమిటిలే నా మొహం. నీపని ఎల్లప్పుడూ కూరల సంచి చేత్తో పట్టుకుని తిరగడమే! అటుపైని పాకగేహవ్యాయామం" అన్నాడు వర్తకుడు.

"మిరపకాయలు పావు శేరు వేతునా?" అడిగాడు వర్తకుడు.

రామదాసు హృదయంలో మిరపకాయ చిదిమినట్లయింది. కూరల వర్తకుడి మాటల్లోని ఎత్తిపొడుపు కారం నసాళానికి అంటుకుంది.

"చాలు. మరేమీ అక్కర్లా" అంటూ సరుకు మూల్యం అణాపైసలతో సహా చెల్లించి అంగడిలోంచి త్వరత్వరగా నిష్క్రమణం సాగించాడు.

కాలు ముందుకు పడలేదు రామదాసుకి. బలవంతంగా అడుగుతీసి అడుగు వేస్తున్నాడు. కూరలఅబ్బి అన్న మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

"ఎంతమాటన్నాడు? నాకు ప్రేమ లేక పోవడమేమిటి? బోలెడంత వుంది నాలో. కనబడ్డ ప్రతి స్త్రీనీ ప్రేమిస్తూనే వున్నాను తరతమ భేదం లేకుండా. నాలో యెంత ప్రేముంటే ఏం లాభం? నా ప్రేమ ఎవరికి కావాలి? డబ్బులేని నన్ను ఏ స్త్రీ ప్రేమిస్తుంది? వ్యక్తిత్వం, స్వయం సామర్థ్యం లేని నన్ను ఎవర్తె ప్రేమించి, పెళ్ళి చేసుకుంటుంది? చేసుకోదు. నావంక తేరిచూడనైనా చూడదు. చూస్తుంది. ఎప్పుడు చూస్తుంది, నేను కారులో వూరేగుతూ జేబులోని ధనం చిత్తుగా ఖర్చు పెడుతూ ఠీవిగా దర్జాగా బ్రతుకుతున్నప్పుడు.

నా బ్రతుక్కి కారూ, చిత్తుగా ధనం ఖర్చుపెట్టడం కూడానా? నా ఠీవి అంతా వంటింట్లో పొయ్యి దగ్గర, పాత్ర సామగ్రి ముందు, కూరకాయల ముందూ చూపించాలి. ఇంత ఠీవీ, దర్జా అయ్యగారి కాలిబూటు చప్పుడు వినగానే పరిసమాప్తి. మేఘం పొరవిచ్చినట్టు ఒక్కసారి విడిపోతుంది. మళ్ళీ నేను ఎప్పటి దరిద్రుణ్ణో. పాత వంటమనిషి రామదాసునే—చుట్టముక్క కొనుక్కునేందుకు కాని చేతలేని కబోదినే.

ఇల్లాంటి నాకు పిలిచి పిల్లనెవరిస్తారు? ఏం చెయ్యడం? ఏది గత్యంతరం?—

బులుసు-జీ-ప్రకాశ్

తలనిండా ఉష్ణజల ప్రవాహాలు.

రామదాసుకీ నౌకిరీ ఛీ అనిపించింది. "దీనికింక స్వస్తి చెప్పేస్తాను. ఇందులో ఎదుగూ బొదుగూ లేదు నాకు. కమ్మగా వంటేన కూలీల జట్టులో చేరి, కూలీ తెచ్చుకుంటాను. దినానికి కొంతచొప్పున ధనం కూడ బెడతాను. తగినంత ధనం చేతబట్టుకుని అప్పుడొక స్త్రీని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాను. అప్పటికిగాని నేను చవట నన్న నిందపోదు. నా అభిలాష తీరదు.

ఒక నిశ్చయానికి వచ్చిన వెనుక దించిన తల యెత్తాడు. తనముందు పోతున్న గుర్రపుబండీలో కూర్చుని భర్తతో కాబోలు సంభాషిస్తున్న జవరాలు ఒకామె ఆకస్మికంగా కంటబడింది.

"ఆ యువతి ఎంతందంగా ఉంది? ఆమెలాంటి చక్కని చుక్కనే వివాహం చేసుకోగలిగితే, ఈ రామదాసు ధన్యుడా? మరీ ధన్యుడా?" అని ఉవ్విళ్లూరిపోయాడు రామదాసు.

* * *

"రామదాసూ! నీచేతి టీ ఇవాళ అన్యోపమానంగా వుంది. ఏంవేసి చేశావో!" అయ్యగారు మిక్కిలి అభినందించారు రామదాసు టీ మిశ్రీకరణ నైపుణ్యానికి—

"అబద్ధం అయ్యగారూ! ఈనాటి టీ బాగుండదు. నేను సరిగ్గా కలిపి యివ్వలేదు. నన్ను ఎగతాళిచేసి ఏడ్పించకండి" రామదాసు వినయంగా బ్రతిమాలుకున్నాడు యజమానిని.

"మనస్ఫూర్తిగా చెయ్యలేదూ?" అడిగాడు టీ కప్పు టేబిల్ పై వుంచుతూ యజమాని—

"మనస్సు బాగోలేదండి దొరగారూ!" అన్నాడు రామదాసు అతి బాధగా—

"సుస్తీగా వుందేమిటి వంట్లో?" అడిగాడు యజమాని.

"లేదండి. చిరాకుగావుంది, మనసులోనే" బదులు చెప్పాడు పాకకళా విశారదుడు.

"బంధువుల కెవరికైనా అనారోగ్యంగా వున్నట్టు వార్త వచ్చిందా?" అయ్యగారు ప్రశ్నించారు.

"ఈ మనోవ్యధ అంతా నాకు సంబంధించిందే." అన్నాడు రామదాసు.

"ఎందుకు రామదాసూ నీకీ మనోబాధ?"

"ఇన్నాళ్ళూ ప్రేమతో ఆదరించి, పోషించిన అయ్యగారిని ఎలా విడవడమా? అన్నదే చింత" రామదాసు జవాబు—

"విడవవలసిన అవసరం ఎందుకొచ్చిందో?"

"ఆత్మీయం దొరగారూ." నసిగాడు.

"నాతో చెప్పకూడదా రామదాసూ! నీకేం శత్రువుని కానే. చెబితే నాచేతనైనంత సహాయం చేస్తాను. చేసి తీరుతా. సిగ్గూ, భయమూ, రెండూ విడిచిపెట్టి, నీ మనసులోని అభిప్రాయమేమిటో నాతో నిక్కచ్చిగా చెప్పు" అన్నాడు యజమాని.

రామదాసు చెప్పలేక పోతున్నాడు.

"భయపడక చెప్పు" అని యజమాని ధైర్యం ఇచ్చాడు.

"ముప్పై... పెళ్ళి చేసుకుంటాను బాబుగారూ!" రామదాసు అన్నాడు.

యజమాని పకపక నవ్వుతూ "దానికి నౌకిరీ విడిచిపెట్టడం ఎందుకోయ్! ఇక్కడ వుండే పెళ్లిచేసుకుంటే, ఎవరు అభ్యంతర పెడతారు? చేసుకో, తప్పక చేసుకో. డజనుమంది భార్యల్ని పెళ్లిచేసుకో రామదాసూ. నాకూడా ఆనందమే. ఈ నిర్జన వసతిలో నీకు సాయం ఎవరూ లేరని చింతిస్తున్నాను. నువ్వొక యింటివాడివైతే, నాకూ చక్కటి కాలక్షేపం.

"కూలిచేసి ధన మార్జించుకుంటానండీ బాబుగారూ."మనోగతం ఆఖరికి ఈ మాటల్లో పూర్తిగా నివేదించాడు రామదాసు.

"ధనం కావాలా? ముందు సంబంధం కుదుర్చుకో. పెళ్లి కెంత ఖర్చవుతుందో ఒక్క దినం గడువుండగా చెప్పు. అంతా నీకు నేనిస్తాను. వెళ్లు. కదిలి వెళ్లి సంబంధం కుదుర్చుకో." యజమాని అత్యభిమానంతో పురికొలిపాడు.

ఇంతలో రామదాసుకి ఓ సందేహం పొడమింది. అయ్యగారు ధనసహాయం చేస్తారు. అనుకున్నట్టు అందాలరాణినే ఉద్వాహం చేసుకుని తీసుకువస్తాడు. కానైతే ఆమె నిల్చనేందుకు స్థలమెక్కడ? ఇప్పటికేదో అయ్యగారు తనింట్లోనే వుండమని ధ్వనిస్తున్నారు కాని, ఎన్నాళ్లుండనిస్తారు? ఆ నగరంలో అరంగుళం జాగాలేదు రామదాసుకి. నౌకిరీ చేసుకుంటూ అయ్యగారి భవనంలోనే నివాసం

చేస్తున్నాడు. ఇప్పుడు "అర్ధాంగి" అన్నది ఒకర్తె వస్తే ఎక్కడ పెట్టను? అద్దెకి ఇల్లెక్కడ తీసుకుందామన్నా అందుకు వాడు ధనహీనుడు.

యజమానికి రామదాసు బాధ అర్థమైందేమో, ఔదార్యంగా—"కొత్త భార్యకి గృహమెక్కడని ఆలోచిస్తున్నావా? ఇద్దరూ ఇక్కడే చిరకాలంవుండి, సంసారం వెళ్ళబుచ్చండి. అదిగో మీబసకి ఆ శ్రేణి అంతా యిచ్చేశాను." అన్నాడు.

రామదాసుకి ఎక్కడలేని ఆనందమూ కలిగింది. అన్నీ సమకూడాయి. ఇక తాను తనకి నచ్చిన పిల్లని వెదికి పెళ్ళి చేసుకుని వెంట తీసుకురావడమే తరువాయి—

కూరగాయల వర్తకుడి దగ్గరికి పరుగునా పోయి పెళ్ళి చేసుకుంటున్నానని చెప్పాడు.

"సుఖీభవ!" అని ఆశీర్వదించి పీకె బంగాళా దుంపల దగ్గిర ఒక అణా హెచ్చు గుంజుకున్నాడు వర్తకుడు.

* * *

పెళ్ళి క్లుప్తంగా ఓ రాత్రిలోనే జరిగిపోయింది. పెళ్ళికూతుర్ని వెంటదీసుకుని, రామదాసు, క్షణం ఆగకుండా యజమాని గృహం చేరుకున్నాడు.

పిల్ల అందమైన పిల్లే! మల్లెపువ్వులా వుంది. పేదవారి బిడ్డ కావడాన ఆమె తల్లిదండ్రులు పేదవాడైన రామదాసుకే యిచ్చి పెళ్ళిచేశారు. అదే వారు కొస్తంత ధనికులైవుంటే ఏధనిక కుటుంబానికి చెందిన వ్యక్తినో జత గూర్చివుందురు. అంతా మన్మధుడి మాయ! వివాహానికి అతడే గ్రంథకర్త కాబట్టి అతడెట్లు కూరిస్తే అటు నడవక తప్పదు వధువులు.

ఆమె అందమైన పిల్లే కాకుండా అతి మంచిపిల్ల అని తెలుసుకుని మరీ పెళ్ళి చేసుకున్నాడు రామదాసు. తనకి అక్షరజ్ఞానం లేకపోయినా అమ్మాయి అయిదో క్లాసు వరకు చదువుకుందిట. చక్కటి పాటలు మృదువైన కంఠస్వరంతో పాడుతుందిట అన్నిటికంటే అభినందించవలసిన విషయం...ఆమె పరాయి పురుషుడెవరినీ కన్నెత్తి చూడనే చూడదట!

రామదాసు కింకేం కావాలి? సలక్షణమైన భార్య దొరికింది. యజమాని వంటగృహంలో నుండి ఉత్తరశ్రేణికి బసమార్చి, అందులోనే భార్యతోపాటు కాపరం పెట్టాడు.

తొలి మూడు రోజులూ సంపంగిని రామదాసు ఎందుకూ బలవంతం పెట్టలేదు. ఏమంటే ఇద్దరిదీ కొత్త పరిచయం. స్వతహాగా ఆమె బిడియపడుతూ వుంటుంది. అతనివద్దకు చేరేటందుకు లోలోపల జంకుతూ వుంటుంది. అట్టి సమయంలో ఆమెని రారమ్మని బలవంత పెడితే, ఆమె అతనంటే దద్దరిల్లిపోయి, చివరికెప్పుడూ కూడా అతన్ని సమీపించలేకపోవచ్చు. అల్లా అయితే రసభంగం. తన భావిజీవితానందానికే ఒక ఆనకట్ట. రామదాసు ఓరిమితో ఊరుకున్నాడు.

అతని పని ఇప్పుడు అతి సుళువుగావున్నది. రెండు చేతులకు మరి రెండు చేతులు తోడు. సంపగి ఒక పనిచేస్తే, తానొక పనిచేస్తున్నాడు. మునుపటికంటే త్వరగా జరుగుతున్నది వంట. అతి సక్రమంగా కూడా జరుగుతున్నది. యజమాని భోజనంచేసిన పిమ్మట ఆ రాజ్యానికి వారే రాట్టూ, రాజ్ఞి. వారి చిత్తం వచ్చినట్లు కులాసాగా వ్యవహరిస్తున్నారు. యజమాని భాగ్యం తామూ అనుభవిస్తున్నారు.

యజమాని ఎన్నడూ "ఇదేమిట"ని అడగలేదు. ఔదార్య పురుషుడు. వెనకా ముందూ ఎవరూ లేరు. పెద్ద ఆస్తి-ఆయన అనుభవించగా ఇంకెందరు రెండు చేతుల్తో అనుభవించినా తరగనిది. ఇంతమాత్రాని కెందుకు ఆగ్రహిస్తాడు?

భార్యకు చీరలు కొనుక్కోమని రామదాసుని పిల్చి అరవై రూపాయ లిచ్చాడు. "గాజుల జత కొనితెచ్చి యిస్తాలే రామదాసూ!" అని కూడా హామీయిచ్చాడు. మంచి రకం చీరలు కొనితెచ్చి రామదాసు, భార్య అలంకరించుకోగా చూసి, తన్మయుడైపోయాడు.

వెన్నెల రాత్రి, కిటికీలోనుండి చంద్రకిరణాలు గదిలో మంచంపై పరున్న సంపంగి ముఖంపై పడుతున్నాయి. ఆ కాంతి ధావళ్యంలో సాగర వీచికల్లా మెరిసిపోతున్నవి ఆమె నీల సిరోజాలు.

మరో కోణంలో పరున్నాడు రామదాసు. నిద్ర పట్టలేదు, సంపంగి తనకి భార్యగా అయిన

చరిత్రని జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు. అనురాగ తరళితమిళితమైంది అతని హృదయం. ఇంతవరకూ అతడామెని స్పృశించలేదు. స్పృశించి, ఆమెని తన బాహుబంధంలో ఇముడ్చుకుని. నలిపెయ్యాలని అభిలాష పుట్టింది. స్త్రీని అనుభవించడానికిదే ప్రథమం. ఆ వింతేదో ఇవేళే అనుభవించాలన్న పట్టుదలతో మెల్లిగా లేచి, సంపంగి నిద్రిస్తూన్న మంచం వద్దకెళ్ళి తట్టిలేపాడు.

ఆమె హఠాత్తుగా చక్షువులు విప్పిచూసింది. భయంతో శాలువా ముసుగులో దూరిపోయింది.

"సంపంగీ!" అని మృదువుగా పిలిచాడు.

"ఊహుహుహుహుహుఁ" అన్నది చలికి వణికిపోతున్నట్లు నూతన వధువు.

"వెన్నెల మధురంగా ఉంది సంపంగీ! ఈవాళ కార్తీక పౌర్ణమి! ఇంత మంచి వెన్నెల మళ్ళీ ఏడాదివరకూ తిరిగిరాదు. దీన్ని మనం అనుభవించకుండా వదిలేయకూడదు. రా సంపంగీ! రా! మంచి పిల్లవి కదూ!" అని ప్రాధేయపడ్డాడు.

"నేను మంచిపిల్లనే. అల్లరి పిల్లని కాను. నన్ను చెడ్డపిల్లని చేయకండి బాబూ!" అంది సంపంగి విసుగ్గా.

రామదాసుకి ఆశ్చర్యం కలిగినా, ఆగ్రహం కలగలేదు. ఎందుకంటే ఆమె మంచి పిల్లని ఎవరో చెప్పగా విన్నాడు. మంచిపిల్ల మంచి వూహల్లోనే వుంటుంది. చెడ్డ ఊహలు ఆమె మదిలో చొరబడనేరవు. ఆమె అంగీకరించక పోవడం సబబే! చెడ్డ పిల్ల కావడానికి ఇచ్చగించింది కాదు. చెడ్డతనం! ఈ చర్య చెడ్డది కాదూ? ఆమెని చెడు చేష్టలికి ఆహ్వానించడం తనదే తప్పనుకున్నాడు.

* * *

"నీ భార్య మంచి పిల్ల. చాలా మంచి పిల్లని పెళ్ళాడేవు రామదాసూ. అది నీ అదృష్టం. జాగ్రత్తగా చూసుకో!" అంటూ వుండేవాడు కూరల వర్తకుడు ప్రతి సాయంత్రమూ రామదాసు తనవద్దకు కూరలకోసం వచ్చినప్పుడల్లా.

"అవును భాయీ, సంపంగి మంచి పిల్లే. ఎంత మంచి పిల్లంటే ఆఖరికి పెళ్ళి చేసుకున్న నావంకసైతం కన్నెత్తి తేరిచూడనంతటి మంచి పిల్ల. ఆమెకి శారీరక సుఖవాంఛ లేమీలేవు. దాని పనేదో దానిది. ఇల్లూ, వంటా, భోజనం నిద్రా, అలంకరణ–అంతే. ఆమె ఎంత పరాఙ్ముఖి అయినా మంచిపిల్ల అవడానికి నేనెంతో గర్విస్తున్నాను" అనేవాడు ప్రత్యుత్తరంగా రామదాసు.

"ఆడవాళ్ళలో అంతమంచి గుణాలు అవుపించడం అరుదు. నీ భార్య మంచిపిల్ల అవడం నువ్వు చేసుకున్న తపస్సే!" కూరల వర్తకుడు మెచ్చుకునేవాడు.

రామదాసు ఆ సాయంత్రం మామూలు కన్నా కొంచెం ముందుగా వెళ్ళాడు. ముందుగా వెళ్లడంలో ప్రత్యేకతవుంది. బజారులోకి కొత్త రకం జలతారు చీరలు వచ్చాయి. నెలనెలా మిగిలిన సొమ్ముచేరి మొత్తం ముప్పై రూపాయలవరకువున్నాయ్. సంపంగికి చీరకొన్నాడు. తదుపరి కూరగాయల నిమిత్తం వర్తక స్నేహితుడి దుకాణానికి పోయాడు.

కూర్చోమని ఆహ్వానించాడు వర్తకుడు.

"మంచిపిల్ల నీ భార్య బావుందా రామదాసూ?" అని నవ్వుతూ రామదాసుని పృచ్ఛించాడు, ఎప్పటికి మల్లే–

కాని ఆ నవ్వు హృదయంలోంచి వచ్చిన సానుభూతి పూర్వకమైన నవ్వులా కనిపించలేదు రామదాసుకి. అందులో ఏవో విషపు వాసనలు వున్నట్లున్నవి. ఎందుకు నవ్వుతున్నాడు? రోజూ ఇట్లానే నవ్వుతున్నాడు. ఈ నవ్వులో ఏదో అంతర్గర్భితమైన ప్రమాదం వుండితీరాలి. తనకి కలగబోయే మహాప్రమాదాన్ని సూచించే నవ్వే యిది! కుళ్లు నవ్వు!

ఆ నవ్వు రంగు చూడలేక, ఆ నవ్వు శబ్దం వినలేక పోయాడు. ఇన్నాళ్ళూ కాలక్షేపం కోసం కొంతసేపక్కడకూర్చుని తాపీగా ఇంటికి చేరుకునేవాడు. ఈనాడు మాత్రం అలా కాదు. తొరతొరగా కొనవలసిన కూరలేవో కొని, విటువ చెల్లించి వెంటనే గృహోన్ముఖుడయ్యాడు.

వెనకనే వినిపిస్తున్నది నవ్వు! వెకిలినవ్వు! విషపు నవ్వు. గుండెలో అంతకుముందులేని అనుమానాలు రేకెత్తిస్తున్నవి. ఒళ్లు ఉడికి పోతున్నది.

అప్పటికి కొంత చీకటి పడింది. ఇంటింటా

దీపాలు వెలిగించారు. యజమాని గృహంలో కూడా అదిగో! దీపం! ఆయన మూడు రోజుల్నుండీ అస్వస్థుడై మంచం పట్టివున్నాడు. ఇల్లు విడిచి ఎక్కడికీ పోలేదు. అతనికి పరిచర్య చేసేందుకెవరైనావున్నారో లేదో. తాను బజారుకి వచ్చేవాడు. సహాయం దీపమే.

రామదాసుకి ఉదీచిశ్రేణి దీపం అవుపించలేదు. "ఇంత చీకటైనా, సంపంగి దీపం ఎందుకు వెలిగించలేదో! బహుశా మధ్యాహ్నం నిద్రలో వుండి వుంటుంది. కొంపంతే ఎక్కడికిపోతుంది? పొరుగిళ్ళకు వెళ్ళదు. అసలెన్నడూ గుమ్మం దిగి ఇవతలకి రాదు."

గృహ బహిర్ద్వారం దాటి ఒక్కడుగు లోనికి వేశాడు. కళ్ళు తిరిగి నట్లయింది. శరీరమే పరిభ్రమిస్తూంది. ఏమిటది?

సంపంగి మంచి పిల్ల. అంత మంచి పిల్ల యజమాని లోగదిలో నుండి వ్యత్యస్త కేశాలతో పమిట సర్దుకుంటూ బయటికి వస్తున్నది.

"ఎందుకక్కడికి పోయావ్?" అని గద్దించి అడిగాడు సంపంగిని.

"యజమానికి నీరు కావలసి వస్తే అందివ్వడానికి వెళ్ళాను. వెళ్ళక తప్పింది కాదు!" అన్నదే సంపంగి సమాధానం

దుకాణదారు నవ్వు ప్రతిధ్వనించింది మళ్ళీ రామదాసు అత్యుష్ణ కర్ణాల్లో.

కథానిక

ఊరేగింపు

యం. సూరి

రామిగాడు సిపాయిల్లో గుండా యింటికి చేరక ముందే వుత్తరం ముక్క ఒకటి చేరింది. దానిలో "నేను వచ్చేటప్పటికి ప్రక్కవూరి పల్లెలోని 'ఈరిని' పెండ్లాడేందుకు మంచిచెడ్డలన్నీ మాట్లాడండి. వాడుకలో వున్న పేర్లకు బదులు రామయ్య, ఈరమ్మ అని వివాహ మహోత్సవ ఆహ్వానపత్రాలు అరవెయ్యి దనుక అచ్చు వేయించండి. పైసల్లో ఏమాత్రం పిక్కకుండా పేరుగన్న మేళగాండ్లను మాట్లాడటము, వూరేగింపుకు ఒక్క మోటారు టాక్సీ, పైన పూలపాలిక కుదిరించాలి. నేను వచ్చేటప్పుడు బనారసు పట్టణం నుండే బట్టలు ఖరీదు చేస్తాను. ఆరుమూడైనా, మూడు ఆరైనా పల్లెలోనే కాకుండా కాపులిండ్లల్లో సహితం తూర్పున కరకర పొద్దు పొడిచిందాక వూరేగాల్సిందే" అని వుంది. ఇది వినేటప్పటికి తలిదండ్రుల గుండెలు గుభేలుమన్నాయి. కొడుకు కొస్తాడని సంతోషించినా వూళ్ళో వూరేగింపు అనే వాక్యం వింటంతోటే వులిక్కి పడి, వుక్కిరి బిక్కిరయ్యారు. అందరి ఆగ్రహాలకు ఆహుతి అవుతామేమోనని ఆందోళన చెందుతున్నారు.

రామిగాడి జాబుముక్క పల్లెలోని కుల పెద్దల చెవుల్లో పడింది. తమకేం తెలియకుండా నిర్ణయించుకున్నందుకు నిప్పయ్యారు. ముందుగా ఏమాటా తమతో చెప్పనందుకు మండిపోయారు. "సిపాయిల్లోకెళ్ళి కొస్త తెల్లపుల్లగా వుంటేమాత్రం పొగరుమోతు తనం సాగుద్దా? పూర్వకాలం నుండి లేని పెండ్లి సంబంధాలు వూళ్ళో అడుగు పెట్టటం ఏటికి ఎదురీదటమే అవుతుంది. ఇది మితం తప్పిన మిడిసిపాటు కాకపోతే మంచికా? పొద్దున లేస్తే కాపుల కనుసన్నల్లో బ్రతికేవాళ్ళం" అనుకొని రామిగాడి తండ్రిని పిలిచారు.

"ఏందిరా! నీ కొడుక్కేమైనా మిల్టరీలో మిగిలిన దాంతో ఏమన్నా మంపెక్కిందా ఏం? తాత తరాలనుండి ఆచారం కొనిదానికి అండవేసి అడ్డంగా నడిస్తే కాపులకు కోపం రాదూ? కాపుల కోపతాపాలతో పల్లెలో కాలు నిలపగలమా? మనకేమైనా పరుగుల పొలాలన్న